నమస్తే తెలంగాణ



# 'మూసీ' ముసుగు దొంగ ఎవరు?

- రుణమాఫీ ఎగ్గొట్టి మురికి రాజకీయాలు
- హామీల అమలు చేతగాకే తిరుగుతున్నడు
- బతుకమ్మ పండుగపై ఎందుకింత నిర్లక్ష్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రాజెక్టు వెనుక దాక్కున్న ముసుగు దొంగ ఎవరు? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలపై శనివారం ఎక్స్ వేదికగా ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నల వర్షం కురిపించారు. మూసీ బ్యూటిఫికేషన్ పేరిట రూ.1.50 లక్షల కోట్లు లూటిఫికేషన్‌కు తెర తీసిన ఘనుడు ఎవరు? రైతు రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తున్న ఆ దొంగ ఎవరు? రైతుబంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు? మహిళలకు వంద రోజుల్లోనే నెలకు రూ.2,500 చొప్పున ఇస్తా అని తప్పించుకు తిరుగుతున్న మోసగాడు ఎవరు? అవ్వ, తాతలకు నెలకు రూ.4,000 ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు? ఆడబిడ్డల పెండ్లిండ్లకు తులం బంగారం ఇస్తా అని మాటతప్పిన దగావీరుడు ఎవరు? అని సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ప్రశ్నలు గుప్పించారు. తెలంగాణ అస్తిత్వ సంబురమైన బతుకమ్మ పండుగపై సర్కారుకు ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసు రాట్లేదా? పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా ఉంచలేరా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. బతుకమ్మ గిట్టదు, పట్టదా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో అక్కా చెల్లెండ్లు బతుకమ్మ ఆడుకోవాల్నా? బ్లీచింగ్ పౌడర్ కొనడానికి, చెరువు కట్టమీద లైట్లు పెట్టడానికి పంచాయతీల్లో పైసల్లేని పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర పండుగను నిర్వహించుకునేందుకు నిధుల్లేని దౌర్భాగ్యం ఎందుకొచ్చింది? మహిళలకు బతుకమ్మ చీరలను రద్దుచేశారని, కనీసం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం చెప్పదల్చుకున్నదా? అని కేటీఆర్ మండిపడ్డారు.



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరులో జరిగిన రైతు ధర్నాలో ప్రసంగిస్తున్న కేటీఆర్. హాజరైన నియోజకవర్గం పరిధిలోని రైతులు

# ఢిల్లీకి డబ్బుల మూటలకే మూసీ

> పింఛను రెండు వేలు పెంచి ఇస్తనని చెప్పి జనవరి, ఆగస్టు రెండు నెలలు ఎగ్గొట్టిండు. ఆరు గ్యారెంటీలను నూరు రోజుల్లో అమలు చేస్తనని చెప్పి 420 హామీలతో రేవంత్‌రెడ్డి మోసం చేసిండు. ఇప్పుడు ఆఖరి వంద రోజుల్లో అమలు చేస్తడేమో! -కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నడు..' అంటూ నిప్పులు చెరిగారు. ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇస్తానని, దొడ్డు వడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తానని బోగస్ మాటలు చెప్పిండని మండిపడ్డారు. రైతులు తలుచుకుంటే ఈ రేవంత్‌రెడ్డి ఉంటడా? అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ప్రధాని మోదీనే ఎదిరించిన మాకు ఈ చిట్టినాయుడు రేవంత్ ఓ లెక్కనా?' అని హెచ్చరించారు. శనివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరులో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు హాజరై రైతులనుద్దేశించి ప్రసంగించారు. 'మొన్నటి ఎన్నికల్లో ఓట్ల కోసం రుణమాఫీ చేస్తానని యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి, వరంగల్ భద్రకాళి అమ్మవారిపై ఒట్టేసి మాట తప్పి దేవుళ్లను కూడా మోసం చేసిన ఘనుడు మన చిట్టినాయుడు' అని దెప్పిపొడిచారు. అన్నవస్త్రం కోసం పోతే ఉన్న వస్త్రం పోయిన చందంగా రాష్ట్రంలో అన్ని వర్గాలను దగా చేస్తున్నడని విమర్శించారు. ఒకే ఇంట్లో ఇద్దరు ముసలోళ్లు, ఆడబిడ్డలకు కూడా నాలుగు వేల చొప్పున పింఛన్ ఇస్తానని చెప్పి నట్టేట ముంచాడని మండిపడ్డారు. రెండు వేలు అదనంగా ఇస్తానని జనవరి, ఆగస్టు రెండు నెలలు ఎగ్గొట్టాడని చెప్పారు.

### రైతులను నాశనం చేసిన ఘనత కాంగ్రెస్‌దే

**మాకు** మూడు ఫాంహౌస్‌లు ఉన్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. అవి ఎక్కడ ఉ న్నాయో ఆయనే చెప్పాలి. మాకు ఒక్కటే ఇల్లు ఉన్నది. అధికారం రాకముందు రైతులకు అరచేతిలో వైకుంఠం చూపి, ప్రభుత్వం వచ్చాక మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దే. కేసీఆర్‌కు నదుల గురించి తెలిస్తే.. రేవంత్‌కు ఫాంహౌస్‌ల నుంచి మురుగు నీటి పారుగంత తెలిసినట్టుంది. కూల్చడం కాదు.. దమ్ము ధైర్యం ఉంటే ఫార్మాసిటీని ఏర్పాటు చెయ్యి. మెట్రో సదుపాయాన్ని కల్పించాలి. మెడికల్ కాలేజీని నిర్మించాలి. రేపు మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే.

- కార్తీక్ రెడ్డి, బీఆర్ఎస్ యువనేత

### చెరువులోనే రేవంత్ ఇల్లు..

**కొడంగల్‌లోని** రేవంత్‌రెడ్డి ఇల్లేమో రెడ్డి చెరువులో, ఆయన అన్న తిరుపతిరెడ్డి ఇల్లు దుర్గం చెరువు శిఖం భూమిలో ఉన్నాయని కేటీఆర్ చెప్పారు. ప్రభుత్వం వాళ్ల అక్రమ నిర్మాణాలను వదిలిపెట్టి పేదలపై ప్రతాపం చూపుతున్నదని విమర్శించారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ముందుగా వారి ఇండ్లను కూలగొట్టిన తర్వాతే మూసీ ప్రక్షాళనపై ముందుకెళ్లాలని సూచించారు.

ఆరు గ్యారెంటీలను నూరు రోజుల్లో అమలు చేస్తానని చెప్పి 420 హామీలు ఇచ్చి మోసం చేసిండని దుయ్యబట్టారు. 'ఇప్పుడు ఆఖరి వంద రోజుల్లో అమలు చేసేలా ఉన్నట్టున్నడు..'అని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ పథకం తెచ్చి ఇండ్లు కట్టిస్తానని చెబితే నమ్మి అధికారం కట్టబెడితే, ఇప్పుడు కూలగొట్టుడే పనిగా పెట్టుకున్నాడని చురకలంటించారు.

### లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళన ఎందుకు?

ఆడబిడ్డల పెండ్లిళ్లకు తులం బంగారం కోసం, ఆసరా పింఛన్ల పెంపునకు పైసల్లేవని చెప్తున్న ముఖ్యమంత్రి.. లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళన ఎందుకు చేపడుతున్నాడో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దొబ్బి ఢిల్లీకి మూటలు పంపేందుకే ఈ ప్రాజెక్టును తెరపైకి తెచ్చాడని ఆరోపించారు. మూసీ ప్రాజెక్టుతో ఎన్నెకరాలకు నీళ్లిస్తావో చెప్పాలని నిలదీశారు. చెరువులు, కుంటలు కాపాడ తాననే నెపంతో హైడ్రాను తెచ్చి నగరజనాన్ని ఆగం చేస్తున్నాడని విమర్శించారు. హైడ్రాను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ నేతలను బద్నాం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. సబితమ్మతో పాటు, వారి ముగ్గురు కొడుకులకు ఫాంహౌస్‌లు ఉన్నాయని అబద్ధాలు చెబుతున్నాడని మండిపడ్డారు. నిజంగా వారికి మూడు ఫాంహౌస్‌లు ఉంటే తామే కూల్చివేయించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. 'నిజంగా ఈ ముఖ్యమంత్రి కడుపు చల్లబడాలంటే మా లాంటి పెద్దోళ్ల ఇండ్లను కూల్చండి.. అంతేగాని పేదల ఇండ్ల పైకి బుల్డోజర్లు పంపవద్దు' అని సూచించారు.

> దేవుళ్లపై ఒట్టేసి రైతులను మోసం చేసిండు.. రైతులు తలుచుకుంటే ఈ రేవంత్‌రెడ్డి ఉంటడా? ఆయన కుర్చీ ఉంటదా? వారి సంఘటిత శక్తి ముందు ఈ ముఖ్యమంత్రి ఎంత? -కేటీఆర్

### రియల్ ఎస్టేట్ కోసమే ఫోర్త్‌సిటీ..

కేసీఆర్ ప్రభుత్వం లక్షమంది తెలంగాణ బిడ్డలకు ఉపాధి కల్పించేందుకు తెచ్చిన ఫార్మాసిటీపై రేవంత్ సర్కారు రోజుకో నాటకమాడుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. బహిరంగ సభల్లో రద్దు చేశామని చెప్తున్న ప్రభుత్వం కోర్టులోనేమో కొనసాగిస్తున్నామని బుకాయిస్తున్నదని విమర్శించారు. గత ప్రభుత్వం కేంద్రం సహకారంతో చేపట్టిన ట్రిపుల్ ఆర్‌పైనా దుష్ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ మంత్రి, కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసం, అస్మదీయుల భూములను కాపాడేందుకు అలైన్‌మెంట్‌ను మార్చేందుకు కుతంత్రాలు చేస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ పాలనలోనే రైతులకు న్యాయం జరిగిందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. ఆయన చేపట్టిన రైతు సంక్షేమ పథకాలతో దేశమంతా తెలంగాణ వైపు చూసిందని పేర్కొన్నారు. రేవంత్ సర్కారు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అన్నదాతను దగా చేస్తున్నదని మండిపడ్డారు. ధర్నాలో మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, శంభీపూర్ రాజు, వాణీదేవి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, రంగారెడ్డి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ యువనేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో మార్కెట్ యార్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో నిర్మిస్తున్న ఇంటిని కూల్చిన అధికారులు

# ఇంద్రవెల్లిలో రెండిండ్ల నేలమట్టం

- ప్రభుత్వ స్థలంలో కట్టుకున్నారంటూ అధికారుల కూల్చివేత
- పంచాయతీ ఎదుట బాధితులు, గిరిజనేతరుల నిరసన
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

ఇంద్రవెల్లి, అక్టోబర్ 5: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో నిర్మించిన ఇంటితోపాటు మండల కేంద్రంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న మరో ఇంటిని అధికారులు కూల్చివేశారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు శనివారం వేకువజామున రెవెన్యూ, ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య జేసీబీ సాయంతో నేలమట్టం చేశారు. దీంతో ఇండ్లు కోల్పోయిన బాధితులతోపాటు మండలంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గిరిజనేతరులు ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై బైఠాయించి 2 గంటల పాటు రాస్తారోకో చేశారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్‌తోపాటు ఉట్నూర్, ఇచ్చోడ సీఐలు మొగిలి, భీమేశ్, ఇంద్రవెల్లి ఎస్సై సునీల్, గుడిహత్నూర్ ఎస్సై ఇమ్రాన్ ఆందోళనకారులకు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ వచ్చి నాయకులతోపాటు గిరిజనేతరులతో చర్చించి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి పంచాయతీ అధికారులతోపా టు ఇతర మండలాలకు చెందిన వారు ఏజెన్సీలో ఇండ్ల నిర్మాణం చేయరాదని బెదిరించడంతోపాటు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంద్రవెల్లి పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్.. అధికారులపై, ఇండ్లకు డబ్బు అడిగిన వారిపై ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామన్న హామీతో ఆందోళన విరమించారు.

### లోకం పోకడ




ముందు ప్రక్షాళన చేయాల్సింది, మూసీ నీళ్లను కాదు, వీళ్ల నోళ్లను!

# కేసీఆర్ 'ఇండ్లు' లేకుంటే బతుకు బస్టాండే!

**మూసీ బాధితులకు డబుల్ ఇండ్ల కేటాయింపు**

**147 మంది నిర్వాసితులకు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం**

**కేసీఆర్‌ను తలుచుకుంటున్న మూసీ నిర్వాసితులు**



అబ్దుల్ సత్తార్ ఖురేషి

హైదరాబాద్ సిటీబ్యూరో/సైదాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లే ఇప్పుడు అక్కర కొస్తున్నాయి. అవే లేకుంటే మా బతుకు బస్టాండే' అని మూసీ నిర్వాసితులు కేసీఆర్ మేలును తలుచుకుంటున్నారు. ఉన్న ఫలంగా ఇండ్లు ఖాళీ చేయించిన అధికారులు మమ్మల్ని ఎక్కడికి తరలిస్తుండ్రు అని తలుచుకుంటేనే భయమేసింది. సామగ్రినీ సరిగా తీసుకోకుండా బిక్కుబిక్కుమంటూ ఇక్కడికి వచ్చాం. కాంగ్రెస్ సర్కారు మోసం చేసిన ఈ తరుణంలో నాడు బీఆర్ఎస్ హయాంలో కట్టించిన ఇండ్లే దిక్కయినయ్.. అని పలువురు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ సార్ చల్లంగా ఉండాలి.. అని బాధిత కుటుంబాలన్నీ దీవిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నాడు పిల్లిగుడిసెల ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు నేడు మూసీ నిర్వాసితులకు వరంగా మారాయి. రూ.29.41 కోట్ల వ్యయంతో నిర్మించిన 288 ఇండ్లలో 2021 ఆగస్టు 28న అనాటి మంత్రి కేటీఆర్ 141 మంది లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించగా, మిగిలిన 147 ఇండ్లను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం శంకర్‌నగర్, మూసానగర్ నిర్వాసితులకు కేటాయించింది. 'సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తామన్న డబుల్ బెడ్ రూం ఇండ్లు ఎవరు కట్టించిండ్రు? కేసీఆర్ కట్టించిన ఆ ఇండ్లే ఇప్పుడు మాకు దిక్కయ్యాయి కదా అని అబ్దుల్ సత్తార్ ఖురేషి తదితరులు ముక్తకంఠంతో చెప్తున్నారు.

# రాజీవ్‌గాంధీకి రేవంత్ ద్రోహం!

- పట్టణ స్థానిక సంస్థల బలోపేతానికి రాజీవ్ తపన
- అధికారాలు కాలరాసేందుకు రేవంత్ తహతహ
- జీహెచ్ఎంసీ అధికారాలు హైడ్రాకు.. బదలాయిస్తూ రాష్ట్ర సర్కార్ గెజిట్ విడుదల
- రాజీవ్ ఊపిరిపోస్తే.. రేవంత్ చావుదెబ్బ కొట్టాడని విశ్లేషకులు, కాంగ్రెస్ సీనియర్ల మండిపాటు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : మైకు దొరికిన ప్రతిచోటా 'రాజీవ్ గాంధీ' జపం చేస్తుంటే.. సీఎం రేవంత్‌రెడ్డికి నిజంగానే ఆయనంటే ఎంత అభిమానమో! అని అంతా అనుకున్నారు. సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహానికి బదులు రాజీవ్ విగ్రహాన్ని పెడితే కాంగ్రెస్‌కు, 'గాంధీ' కుటుంబానికి రేవంత్ వీరభక్తుడని, రాజీవ్‌గాంధీనే అనుసరిస్తాడని భావించారు. కానీ ఇదంతా రాజకీయ లబ్ధికోసం చేసిన బూటకమేనని తేలిపోయింది. తన మానస పుత్రిక 'హైడ్రా' కోసం జీహెచ్ఎంసీ అధికారాలను బదలాయిస్తూ ప్రభుత్వం గెజిట్ తీసుకురావడంతో నిజమైన కాంగ్రెస్‌వాదులకు ఇన్నాళ్లు కమ్ముకున్న పొరలు తొలిగిపోయాయి. నాడు స్థానిక సంస్థల బలోపేతానికి రాజీవ్‌గాంధీ పునాదులు వేస్తే.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి ఆ పునాదులను పెకలించేశారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో జీహెచ్ఎంసీకి, దాని కమిషనర్‌కు ఉన్న అధికారాలను ఇతర ఏజెన్సీ లేదా అధికారికి బదలాయించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కట్టబెట్టారు. తద్వారా జీహెచ్ఎంసీ కోరలు పీకేసి, ప్రత్యామ్నాయ వ్యవస్థను తెచ్చారని రాజ్యాంగ నిపుణులు విమర్శిస్తున్నారు.

### నాడు రాజీవ్ తపన..

స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లను బలోపేతం చేసేందుకు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారు. సింఘ్వీ కమిటీ లాంటి నిపుణుల బృందాలను నియమించి కార్యాచరణ రూపొందించారు. పట్టణ స్థానిక సంస్థల బలోపేతానికి ప్రణాళిక రూపొందించి, పూర్తిస్థాయిలో నియమ నిబంధనలతో బిల్లును తయారుచేశారు. 65వ రాజ్యాంగ సవరణ రూపంలో 1989లో లోక్‌సభలో బిల్లు పాస్ అయినా రాజ్యసభలో ఆగిపోయింది. రాజీవ్‌గాంధీ మరణానంతరం దివంగత ప్రధాని పీవీ హయాంలో 1993లో 74వ రాజ్యాంగ సవరణ బిల్లుగా ఆమోదం పొందింది. పట్టణ స్థానిక సంస్థల బలోపేతానికి గట్టి పునాది పడింది. ఈ రాజ్యాంగ సవరణ ప్రకారం పట్టణ స్థానిక సంస్థల రూపురేఖలు, పాలనా వ్యవహారాలు వంటివి నిర్ణయమయ్యాయి.

### మూడు దశాబ్దాల స్వేచ్ఛకు మంగళం

**నాటి** కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తిని మూడు దశాబ్దాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ స్థానిక సంస్థలకు రాజీవ్ గాంధీ ఊపిరిపోస్తే తాజా గెజిట్‌తో సీఎం రేవంత్‌రెడ్డి చావుదెబ్బ కొట్టాడని రాజకీయ విశ్లేషకులు, కాంగ్రెస్ సీనియర్లు మండిపడుతున్నారు. పరిరక్షణ పేరుతో రోడ్లు, వీధులు, జలవనరులు తదితర ప్రభుత్వ ఆస్తులపై అజమాయిషీని ఏజెన్సీకి కట్టబెట్టారని, కేవలం తన రాజకీయ స్వార్థం కోసం పుట్టించిన 'హైడ్రా' కోసం జీహెచ్ఎంసీని బలి పెడతారా? అంటూ ప్రశ్నిస్తున్నారు.



నాగోలులో జరిగిన మీటింగ్‌లో నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి మాట్లాడుతుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

# మూసీకి మద్దతు.. రేవంత్‌కు భజన!

- సమావేశం రైతులది.. హాజరైంది నాయకులు
- మూసీ బాధితుల ఊసే లేకుండా సమావేశం
- రేవంత్‌పై పొగడ్తలతో విసుగెత్తించిన నేతలు
- భూములు, ఇళ్లు ఇవ్వాల్సిందేనని ప్రసంగాలు
- సమావేశానికి దూరంగా ఉన్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో/ మన్సూరాబాద్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ): మూసీ ప్రక్షాళన చేద్దాం.. రైతాంగాన్ని ఆదుకుందాం.. అంటూ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ నేతలు సమావేశం నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి తరలించిన కాంగ్రెస్ నేతలతో ఈ కార్యక్రమం రైతులు లేని నేతల కార్యక్రమంలా మారింది. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అంతా తానై నిర్వహించగా, మూసీ ప్రక్షాళనకు సహకరించాలని చెప్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకాకపోవడం కాంగ్రెస్ నేతల్లోనే చర్చకు దారితీసింది. మూసీ ప్రక్షాళనతో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఉపయోగంగా ఉంటుందన్న ఆలోచనను రైతుల్లో కల్పించే దిశగా కాంగ్రెస్ నేతలు చేసిన ప్రయత్నాలు అసలు రైతులే రాకపోవడంతో విఫలమయ్యాయి.

### రైతుల పేరిట కాంగ్రెస్ నేతలు

మూసీ ప్రక్షాళనలో రైతులకు బదులు తమ కాంగ్రెస్ నేతలు కార్యకర్తలను, లోకల్ లీడర్లను తరలించారు. రైతులను తీసుకురావాలనుకున్నా.. వారెవరూ సహకరించకపోవడంతో కార్యక్రమం అభాసుపాలు కాకుండా పార్టీ కార్యకర్తలు, లీడర్లతోనే మమ అనిపించారు. కుర్చీల్లో అందరూ కాంగ్రెస్ నేతలే ఉండడంతో రేవంత్ భజనతో నేతల ప్రసంగాలు కొనసాగాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వస్తారని భావించినప్పటికీ ఆయన ముఖం చాటేశారు. మూసీ ప్రక్షాళనకు అందరూ సహకరించాలని చెబుతున్న కోమటిరెడ్డి సొంత పార్టీ కార్యక్రమం అందునా సొంత జిల్లా నేతలు నిర్వహించిన కార్యక్రమానికి చివరి నిముషంలో హ్యాండిచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకే పెద్ద దిక్కుగా భావించే కోమటిరెడ్డి కార్యక్రమానికి రాకపోవడంతో హాజరైన నేతలలో చర్చ జరిగింది. ఉమ్మడి నల్లగొండ కాంగ్రెస్‌లో గ్రూప్ వార్ కొనసాగుతుందని, రేవంత్ భజన చేసే బ్యాచ్‌తో తాను కలవాల్సిన అవసరం లేదని మంత్రి రాలేదని కోమటిరెడ్డి అనుచరులు కొందరు అక్కడికి వచ్చి వెంటనే బయటకు వెళ్లిపోయారు.

# అధికారాలను బదలాయించేలా ఆర్డినెన్స్!

**హైడ్రా చట్టబద్ధత కోసం ప్రభుత్వం గెజిట్**

**జీహెచ్ఎంసీ చట్టసవరణకు ఆమోదం**

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): హైడ్రా చట్టబద్ధత కోసం ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. జీహెచ్ఎంసీకి, కమిషనర్‌కు ఉండే అధికారాలను ఏదేని ఏజెన్సీకి లేదా అథారిటీకి, అధికారికి బదలాయించేలా జీహెచ్ఎంసీ చట్టం-1955లో మార్పులు చేసింది. సెక్షన్ 374-ఏకు సవరణ చేస్తూ 374-బీ సెక్షన్‌ను జోడించింది. ప్రభుత్వ సవరణకు గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఆమోదం తెలిపారు. దీంతో ఈ నెల 3 నుంచి ఆర్డినెన్స్ అమల్లోకి వస్తున్నట్టు ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. 'రోడ్లు, నాలాలు, జలవనరులు, ఖాళీ ప్రదేశాలు, పార్కులు, వీధులు తదితర కార్పొరేషన్/రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా రక్షించడం, నిరంతరం పర్యవేక్షించడం' కోసం ఈ మార్పులు చేస్తున్నట్టు గెజిట్‌లో పేర్కొన్నది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతోపాటు విపత్తుల నిర్వహణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించింది.

# హైడ్రా తరహాలో నిజామాబాద్‌లో నిడ్రా

**పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడి**

కంఠేశ్వర్, అక్టోబర్ 5: హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో నిజామాబాద్‌లో కూడా నిడ్రా వస్తుందని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ తెలిపారు. శనివారం ఆయన నిజామాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. నిజామాబాద్‌కు నిడ్రా రావాల్సిన అవసరం ఉన్నదని, కచ్చితంగా వస్తుందని చెప్పారు. ప్రభుత్వ భూములు, దేవాలయ, యూనివర్సిటీ స్థలాలను ఎవరు కబ్జా చేసినా వదిలే ప్రసక్తే లేదని అన్నారు. కబ్జాల విషయంలో పార్టీలకతీతంగా ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకోవాలని కలెక్టర్, సీపీలకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. జిల్లాలో మరో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.




హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ శంకర్‌బస్తీలో ఇంటిని కూలగొడుతున్న దృశ్యం



రేవంత్‌రెడ్డి పంపే బుల్డోజర్లు మా ఇండ్లదాకా రావద్దని మూసీకి వినతిపత్రం ఇస్తున్న సత్యానగర్ మహిళలు

# బఫర్ జోన్‌కూ బుల్డోజర్!

> చెరువులు, కుంటల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఉండే నిర్మాణాలను కూల్చేస్తాం. నాలాలు, కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం. మూసీ రివర్ బెడ్‌తో పాటు బఫర్ జోన్ పరిధిలో ఉండే జనాలను అక్కడి నుంచి తరలించాల్సిందే.
>
> - 3న సికింద్రాబాద్ ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రారంభ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి...

డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) అధికారులు రూపొందించిన మ్యాపులో బ్లూ కలర్ గీత నుంచి 30 మీటర్లు అంటే సుమారు వంద ఫీట్లు వరకు ఉండే నిర్మాణాలను కూడా కూల్చివేయనున్నారు. ఈ క్రమంలో 'నమస్తే తెలంగాణ' ముందుగా అంచనా వేసినట్టుగానే దాదాపు లక్షన్నర నిర్మాణాలకు ఎసరు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు గుర్తించిన మూసీ మ్యాపింగ్ ప్రకారం రివర్ బెడ్(రెడ్ లైన్), ఫుల్ రివర్ లెవల్(బ్లూ లైన్) మాత్రమే ఉంది. కానీ ఎఫ్‌ఆర్ఎల్ హద్దుల నుంచి మరో 30 మీటర్ల దూరం ఉండే ప్రాంతాన్ని బఫర్ జోన్‌గా నిర్ధారించనున్నారు. దీంతో రెడ్, బ్లూ లైన్ల తరహాలో మరో గీత గీసి పేద, మధ్యతరగతి వర్గాల సొంతిళ్లను మూసీలో కలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నద్ధమైంది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలే సాక్ష్యంగా నిలుస్తుండగా, మూసీ ప్రాజెక్టు పేరిట లక్షలాది మంది పేద, మధ్యతరగతి వర్గాలు అన్ని అనుమతులతో నిర్మించుకున్న ఇండ్లు, అపార్టుమెంట్లు, భవనాలు కుప్పకూలిపోనున్నాయనేది స్పష్టమైంది. తొలుత కలుషిత వాతావరణం, దోమలు, చెత్తాచెదారంతో ఉండే మూసీ రివర్ బెడ్ నివాసితులను తొలగిస్తామని చెప్పిన ప్రభుత్వం.. దశల వారీగా మూసీ ఎఫ్‌ఆర్ఎల్‌కి వంద మీటర్ల దూరంలో అన్ని అనుమతులతో నిర్మించుకున్న భవనాలనూ కూల్చనుంది. రివర్‌బెడ్ నిర్మాణాలు, ఎఫ్‌ఆర్ఎల్ కట్టడాలతోపాటు బఫర్ జోన్ల వారీగా మూసీ వెంబడి మార్కింగ్ చేస్తే ఇప్పుడున్న లక్షన్నర నిర్మాణాల సంఖ్య తారుమారు కానుంది. మూసీకి ఇరువైపులా 30 మీటర్ల దూరాన్ని బఫర్ జోన్‌గా నిర్ధారించాల్సి ఉంటుంది. ఇదే జరిగితే మూసీలో మునిగే నిర్మాణాల సంఖ్య మరో 2 లక్షలకు పెరగనుంది. దీంతో మూడున్నర లక్షలకు పైగా నిర్మాణాలు మూసీలో కొట్టుకుపోనున్నాయి.

> మూసీ రివర్ బెడ్‌తో పాటు బఫర్ జోన్ నిర్మాణాలను కూడా తొలగిస్తాం. అక్కడ ఉండే పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన నిర్మాణాలను కూల్చివేస్తాం. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు. మూసీ పరీవాహక ప్రాంత జనాలను నిర్వాసితులుగా మార్చకుండా ప్రత్యామ్నాయ మార్గాలకు ప్రణాళికలు రూపొందిస్తాం. - 5న రవీంద్రభారతిలో జరిగిన వెంకటస్వామి జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

### బరాబర్ బఫర్ జోన్ తొలగించుడే

ఎంఆర్‌డీసీఎల్ ప్రకటించిన మ్యాపింగ్ ఆధారంగా ఇప్పటివరకు బఫర్ జోన్ నిర్ధారణ కాలేదు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాటలు పేద, మధ్యతరగతి వర్గాలను భయాందోళనలకు గురిచేసేలా ఉన్నాయి. బరాబర్ బఫర్ జోన్ నిర్మాణాలను తొలగించాల్సిందేనని స్వయంగా ముఖ్యమంత్రి చెప్తుండటంతో బఫర్ జోన్ మరింత ఆందోళనకరంగా మారనుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మ్యాపింగ్ ప్రకారం ఫుల్ రివర్ లెవల్ పరిధిలోనే వందలాది నిర్మాణాలు ప్రభావితం అవుతున్నాయి. అందులోనూ గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్లతోపాటు, అన్ని అనుమతులతో నిర్మించుకున్న భవనాలు కూడా ఉన్నాయి. ఇక బఫర్ జోన్ పరిధిని కూడా నిర్ధారిస్తే మూసీ పరీవాహక ప్రాంతం మరింత పెరుగుతుందని, ఇప్పుడున్న దానికంటే రెండింతల వెడల్పుగా మారబోతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రివర్ బెడ్ పరిధి వరకే కలుషిత వాతావరణం, దుర్గంధమైన పరిసరాలు ఉన్నాయి. కానీ బఫర్ జోన్ ప్రాంతాన్ని నిర్ధారిస్తే గనుక... దశాబ్దాల క్రితమే హుడా, జీహెచ్ఎంసీ లాంటి సంస్థల అనుమతులతో నిర్మించుకున్న కట్టడాలన్నీ కూలనున్నాయి. ఇప్పటికే ఎఫ్‌ఆర్ఎల్ పరిధిలో ఉండే ఆలయాలు, చర్చిలు, మసీదుల తొలగింపు అనివార్యంగా మారింది. ఇక బఫర్ జోన్ నిర్ధారణ జరిగితే ఇన్నాళ్లు చిన్న చిన్న గుడిసెలు, రేకుల షెడ్డుల్లో ఉన్న పేదలతో పాటు, పదికాలాలు కుటుంబానికి నీడనిచ్చేలా నిర్మించుకున్న భవంతులూ కూలక తప్పదు.

### ఊసే లేని భూసేకరణ

బఫర్ జోన్ నిర్మాణాలను తొలగించాల్సిందేనని చెబుతూనే బఫర్ జోన్ పరిధిలో కూలిపోయే నిర్మాణాలకు ప్రత్యామ్నాయం చూపుతామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారే తప్ప భూసేకరణ విషయాన్ని ప్రస్తావించడం లేదు. పట్టా భూముల్లోని కట్టడాలు, నిర్మాణాలను ప్రభుత్వం కూలగొట్టాలంటే కచ్చితంగా వారి నుంచి భూములను సేకరించాల్సిందే. దీనికి 2013లో కాంగ్రెస్ తెచ్చిన భూసేకరణ చట్టంప్రకారమే సేకరించాల్సి ఉంటుంది. కానీ ఆ చట్టం ఊసే ఎత్తకుం డా నేరుగా బఫర్ జోన్ మార్కింగ్‌తో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన నిర్మాణాలను కూల్చే కుట్రలకు రేవంత్ తెరలేపారు.